# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **లోక్ సభ-2024 ఎన్నికలు కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కాదని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు అని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విడుదల చేసింది.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నియమావళి ముగిసే వరకు ఇంటింటికీ పింఛన్ల పంపిణీ నిలిపివేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ -సెర్ప్ ఉత్తర్వులు జారీ చేసింది.**
4. **అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర ఈరోజు సంజీవపురం నుంచి ప్రారంభం కానుంది.**
5. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు ఢిల్లీలో పర్యటించనున్నారు.**
6. **అయోధ్య శ్రీరాముడి దర్శనానికి వెళ్లే వారి కోసం హైదరాబాద్ నుంచి విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయని కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్‌రెడ్డి తెలిపారు.**

**=========================**

లోక్ సభ -2024 ఎన్నికలు కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కాదని భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దేందుకు అని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ పదకొండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నపుడు పేదరికం అధికంగా ఉండేదని ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిన తర్వాత 25 కోట్ల మంది ప్రజలు విజయవంతంగా పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు.

-------------------------

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విడుదల చేసింది. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఎంపిక చేసిన కేంద్రాల్లో మాత్రమే ఓటు వేయాలని తెలిపింది. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు కోసం ఫారం-12 అందజేస్తామని,

అందులో వారు తాము ఎక్కడ ఓటు వేయాలో ఎంచుకోవాలని సూచించింది. ఓటరుగా నమోదైన నియోజకవర్గం లేదా విధులు నిర్వర్తించే నియోజకవర్గాన్ని ఎంచుకోవచ్చని పేర్కొంది. ఉద్యోగి పేరు, ఎంప్లాయికోడ్, హోదా, శాఖ, మొబైల్ నంబరు, పనిచేస్తున్న నియోజకవర్గం, సొంత నియోజకవర్గం, దాని సంఖ్య, ఓటర్ల జాబితాలో నంబరు, గుర్తింపు కార్డు సంఖ్య వివరాలను సైతం ఫారం–12లో పొందుపరచాలని పేర్కొంది. పోస్టల్ ఓటు వేసే ఉద్యోగుల కోసం ఎన్నికల కేంద్రాలను తాత్కాలికంగా ఆర్‌వో/ఏఆర్‌వో కార్యాలయం, లేదా ఏదైనా ఇతర కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నియమావళి ముగిసే వరకు ఇంటింటికీ పింఛన్ల పంపిణీ ఉండదని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ –సెర్ప్ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో సచివాలయాల్లోనే పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న కారణంగా వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని స్పష్టం చేసింది. పింఛను కోసం లబ్ధిదారులు ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు తీసుకెళ్లాలని సెర్ప్ సూచించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర ఈరోజు సంజీవపురం నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి సంజీవపురం నుంచి బయలుదేరి బత్తలపల్లి, రామాపురం ,కట్ట కిందపల్లి, రాళ్ళ అనంతపురం, ముదిగుబ్బ, ఎన్‌ఎస్పి కొట్టల, మలకవేముల మీదుగా పట్నం చేరుకుంటారు. పట్నం నడింపల్లి, కాలసముద్రం, ఎర్ర దొడ్డి మీదుగా కుటగుల చేరుకుంటారు. అనంతరం బయలుదేరి కదిరి పట్టణం చేరుకుని ఇఫ్తార్ విందులో పాల్గొంటారు.

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఢిల్లీలో పర్యటించనున్నారు. తెలంగాణలో మిగిలిన 4 ఎంపీ స్థానాల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రేవంత్ రెడ్డి చర్చించనున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే 13 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ వరంగల్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ స్థానాలను ప్రకటించలేదు. రేవంత్ రెడ్డి పర్యటనలో ఈ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై స్పష్టత రానుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణలో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందిచాలని భారత రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖరావు పేర్కొన్నారు. జనగామ, సూర్యాపేట జిల్లాల్లో నిర్వహించిన పొలం బాటలో భాగంగా దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని చెప్పారు. ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

---------------------------

అయోధ్య శ్రీరాముడి దర్శనానికి వెళ్లే వారి కోసం హైదరాబాద్ నుంచి అయోధ్యకు విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయని కేంద్రమంత్రి, బిజేపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్

2 నుంచి వారానికి 3 రోజులు మంగళవారం, గురువారం, శనివారాల్లో విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆయన పేర్కొన్నారు.

---------------------------

దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో 2024-25 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ - యూజీ 2024 పరీక్షకు దరఖాస్తుల గడువును మరోసారి పొడిగిస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్‌టీఏ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం మార్చి 26తో దరఖాస్తుల గడువు ముగియగా.. ఇటీవల మార్చి 31 వరకు గడువు పెంచగా తాజాగా మరోసారి దరఖాస్తుల సమర్పణకు గడువు పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఏప్రిల్ 5వ తేదీ రాత్రి 9 గంటల 50 నిమిషాల వరకు అభ్యర్థులు exams.nta.ac.in/CUET-UG సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్‌టీఏ పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం దక్షిణ శాసనసభ స్థానం జనసేన అభ్యర్థిగా సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్ పేరును పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన.. నిన్న పార్టీ ముఖ్యులతో వివిధ అంశాలపై చర్చించారు. ప్రచార కార్యక్రమాలు, కూటమిలో భాగంగా పార్టీల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు. పోలింగ్ ముగిసే వరకు క్షేత్రస్థాయిలో కలిసి పనిచేయాలని కోరారు. ఈ క్రమంలో విశాఖ దక్షిణ స్థానం అభ్యర్థిని ప్రకటించారు. కాగా ఇప్పటివరకు 19 అసెంబ్లీ స్థానాలకు, రెండు ఎంపీ స్థానాలలకు అభ్యర్థులను జనసేన పార్టీ ప్రకటించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రేపు ఆలయ శుద్ధి కార్యక్రమం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం రోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పన్నుల రూపంలో ప్రజలపై భారం మోపుతోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆమె హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైనా 2 లక్షల రూపాయల రుణ భారం ఉందని అన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైయస్సార్ పార్టీ నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బస్సు యాత్ర ఏర్పాట్లను ఆయన నిన్న పార్టీ నాయకులతో కలిసి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు యాత్ర జరిగే ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ప్రజలతో మమేకమవుతారని ఆ గ్రామాల ప్రజలకు ముందే తెలియజేయాలన్నారు. బస్సు యాత్ర ద్వారా సంక్షేమ పథకాల గురించి చెప్పడంతో పాటు ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకుంటారని తెలిపారు.

=====================